




శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన సిరికొండ మధుసూదనాచారిని ఆయన ఛాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు ముదిరి పాకానపడింది. కొద్ది నెలలుగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మధ్య చేరికల విషయమై మొదలైన గొడవ పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న నేపథ్యంలో దసరా వేడుకలు మరింత ఆజ్యం పోశాయి. పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు గొడవకు దారి తీశాయి. కొండా వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో లేదని రేవూరి వర్గం గొడవకు దిగింది. ఫలితంగా ఇరువర్గాల మధ్య నెలకొన్న ఘర్షణ దాడికి దారి తీసి పోలీస్ స్టేషన్‌కు చేరింది. తమ అనుచరులను అరెస్ట్ చేసి కొడతారా? అంటూ మంత్రి సురేఖ పోలీస్ స్టేషన్‌కు రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సీఐ కుర్చీలో కూర్చొని బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝూ హామీతో అక్కడి నుంచి వెళ్లిపోయింది.

*- గీసుగొండ, అక్టోబర్ 13*



కొండా, రేవూరి మధ్య ముదిరిన లొల్లి

# భగ్గుమన్న వర్గపోరు




గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో తన వర్గం నాయకులతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

## దసరా వేడుకల్లో మరోసారి బయట పడిన గ్రూపు రాజకీయాలు

- కాంగ్రెస్ ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో లేదంటూ ప్రకాశ్‌రెడ్డి వర్గం గొడవ
- రేవూరి వర్గీయులను చితకబాదిన కొండా అనుచరులు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- గీసుగొండ పోలీస్ స్టేషన్‌కు ఆటోలో వెళ్లిన మంత్రి సురేఖ
- సీఐ కుర్చీలో కూర్చొని పోలీసులపై పెత్తనం
- డీసీపీ, ఏసీపీ, సీఐపై చర్య తీసుకోవాలని డిమాండ్
- వరంగల్ సీపీ హామీతో తిరిగి వెళ్లిన మంత్రి

గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో శనివారం దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా వర్గీయులుగా చెలామణి అవుతున్న బండి రాజ్‌కుమార్, ముస్కు సురేశ్, కూస రాజ్‌కుమార్, చౌడు శివప్రసాద్, ముస్కు రాజుకుమార్, చుంచు రాజు, మహేశ్వర్, వంశీ మంత్రి సురేఖ, మురళీధర్‌రావు ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గీయులు పిట్టల అనిల్, పిట్టల భాను ఎమ్మెల్యే ఫొటో ఎందుకు పెట్టలేదని గొడవకు దిగారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. స్థానికులు కల్పించుకొని ఇరువర్గాలను శాంతింపజేయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొద్ది సేపటికే కొండా వర్గీయులు ఏర్పాటు చేసిన ఫెక్సీలను చించివేయటంతో పిట్టల అనిల్,భానుపై దాడిచేసి చితకబాదారు. గాయాలపాలైన పిట్టల అనిల్‌ను ఆదివారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరామర్శించారు. ఆ సమయంలో గ్రామంలో మళ్లీ గొడవలు కాకుండా ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అనంతరం అనిల్, భాను కొండా వర్గీయులైన ఎనిమిది మందిపై గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో బండి రాజ్‌కుమార్, ముస్కు సురేశ్, కూస రాజ్‌కుమార్, చౌడు శివప్రసాద్, ముస్కు రాజ్‌కుమార్, చుంచు రాజును పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కొట్టారు. అందులో ముగ్గురు భవాని మాల వేసుకున్నారని, వారిని వదిలిపెట్టాలని కొండా వర్గానికి చెందిన గోపాల నవీన్‌రావు కోరారు. అయినా వినకుండా వారిని స్టేషన్‌లోనే ఉంచటంతో ఈ విషయాన్ని మంత్రి సురేఖ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సురేఖ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతికి ఫోన్ చేసినా పట్టించుకోకపోవడంతో మంత్రి సూచన మేరకు ఆమె వర్గీయులు ఎల్ రాజు, క్రాంతికుమార్, వంశీ, రంజిత్ ఆధ్వర్యంలో ధర్మారంలో ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న గీసుగొండ సీఐ మహేందర్, మామునూరు ఏసీపీ తిరుపతి అక్కడికి చేరుకొని అనుమతి లేకుండా ధర్నా చేస్తే కేసులు పెడతామని హెచ్చరించడంతో వారు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**ఆటోలో పోలీస్ స్టేషన్‌కి..**

పోలీసులు మాట వినడం లేదని ఆగ్రహించిన మంత్రి కొండా సురేఖ గీసుగొండకు బయల్దేరారు. ధర్మారం వద్ద ధర్నా చేస్తున్న క్రమంలో ట్రాఫిక్ జామ్ కావడంతో మంత్రి కాన్వాయ్ దిగి నడుచుకుంటూ ధర్నా చేస్తున్న వారి వద్దకు చేరుకున్నారు. వారితో కలిసి ఆటోలో గీసుగొండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తన వర్గీయులను పోలీసులు కొట్టిన దెబ్బలు చూసి ఆవేశంతో ఉగిపోయిన మంత్రి సురేఖ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వారిని ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. వారి కష్టంతోనే పరకాలలో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి గెలిచాడని గొడవకు దిగారు. గాయాలైన పిట్టల అనిల్‌ను స్టేషన్‌కు తీసుకొని రావాలని పట్టుబట్టారు. అలాగే తమ వారిపై దాడి చేసిన డీసీపీ రవీందర్, ఏసీపీ తిరుపతి, సీఐ మహేందర్‌ను బదిలీ చేసి వారిపై చర్యలు తీసుకునే వరకు ఇక్కడే ఉంటానని పోలీస్‌స్టేషన్‌లో కూర్చున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీసీపీ మంత్రికి చెప్పినా ఆమె అక్కడే ఉండడంతో కొండా వర్గీయులు భారీ సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝూ గీసుగొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మంత్రి సురేఖతో మాట్లాడారు. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో మంత్రి అక్కడి నుంచి వెళ్లిపోయారు. బయటకు వచ్చిన మంత్రి సురేఖతో మీడియా ప్రతినిధులు మాట్లాడేందుకు యత్నించగా ఆమె చెప్పేదేమీ లేదంటూ వెళ్లిపోయారు. ఈ సందర్భంగా కొండా వర్గీయులు 'పోలీసులు డౌన్.. డౌన్.. న్యాయాన్ని రక్షించాలి' అంటూ నినాదాలు చేసినా పోలీసులు ఏమీ చేయలేక చూస్తుండిపోయారు.



పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కొండా వర్గీయులు

### సీఐ కుర్చీలో మంత్రి సురేఖ

మంత్రి కొండా సురేఖ రాజ్యాంగ బద్ధ పదవిలో ఉండి కనీస ఆలోచన లేకుండా పోలీస్ స్టేషన్‌లో సీఐ కుర్చీలో కూర్చున్నారు. ఏసీపీ, సీఐ మంత్రి ముందు నిలబడి ఆమె అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. డీసీపీ ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటే .. మంత్రి మాత్రం సీఐ కుర్చీలో కూర్చొని పోలీసులపై పెత్తనం చేయడం ఏమిటని స్థానికులు చర్చించుకుంటున్నారు.

# కనులపండువగా తెప్పోత్సవం

- భద్రకాళీ చెరువులో హంసవాహనంపై ఊరేగిన అమ్మవారు
- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



భద్రకాళీ చెరువులో హంసవాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

వరంగల్, అక్టోబర్ 13 : భద్రకాళీ అమ్మవారి తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం విజయదశమిని పురస్కరించుకుని భద్రకాళీ చెరువులో విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించిన హంస వాహనంపై అమ్మవారు ఊరేగారు. ఈ వేడుకకు రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, తెప్పోత్సవం శాశ్వత దాత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మేయర్ గుండు సుధారాణి హాజరయ్యారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలిరాగా, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆదివారం సాయంత్రం భద్రకాళీ-భద్రేశ్వరుల కల్యాణం ఆలయ ప్రధాన అర్చకుడు శేషు ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. అమ్మవారిని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి దర్శించుకున్నారు. కల్యాణోత్సవంతో ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు పరిసమాప్తం అయినట్లు ఈవో శేషుభారతి తెలిపారు.



హనుమకొండ బస్ స్టేషన్‌లో బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

# తిరుగు ప్రయాణానికీ తిప్పలే..

- ఆర్టీసీకి పోటెత్తిన జనం
- హైదరాబాద్ రూట్లో రద్దీ
- కిటకిటలాడిన హనుమకొండ బస్‌స్టేషన్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 13 : బతుకమ్మ, దసరా పండుగకు సొంతూళ్లకు వచ్చిన ప్రజలకు తిరుగు ప్రయాణంలోనూ తిప్పలు తప్పలేదు. తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు వరంగల్ రీజియన్ పరిధిలోని అన్ని బస్టాండ్లకు ఆదివారం తరలిరావడంతో అవి ప్రయాణికులతో నిండిపోయాయి. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్‌కు కేంద్ర బిందువైన హనుమకొండ బస్టాండ్ కిటకిటలాడింది. ఆయా ప్రాంతాలకు వెళ్లే బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా హైదరాబాద్ రూట్‌లో ప్రయాణికులు పోటెత్తారు. సోమవారం విధుల్లో చేరేందుకు ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే వారు హైదరాబాద్ వెళ్లేందుకు బస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. వచ్చిన బస్సుల్లో ఎక్కడానికి, సీటు దక్కించుకోవడానికి నానా ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు హైదరాబాద్ రూట్‌లో సుమారు 550 బస్సులు నడిపినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఇవికాకుండా హైదరాబాద్ మీదుగా బెంగళూర్, విజయవాడ, తిరుపతి, నెల్లూరు, శ్రీశైలం, మిర్యాలగూడ తదితర దూరప్రాంతాలకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సర్వీసులను నడిపారు. అయితే రద్దీని దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ప్రాంతాల సర్వీసులను రద్దు చేసి హైదరాబాద్‌కు బస్సులు నడపడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ముఖ్యంగా ములుగు, ఏటూరునాగారం, భూపాలపల్లి, నర్సంపేట, తొర్రూరు, పాలకుర్తి, ధర్మసాగర్, వరంగల్ సిటీ ప్రయాణికులు బస్సుల కోసం రోడ్ల మీద నిరీక్షించారు.

# నగరంలో భారీ వర్షం

**ఇబ్బందులు పడిన వాహనదారులు**

హనుమకొండ, అక్టోబర్ 13 : హనుమకొండ నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒకేసారి వర్షం కురువడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. హనుమకొండ బస్టాండ్, బాలసముద్రం, వికాస్‌నగర్, సుబేదారి, ఆర్ఈసీ ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో దుర్గామాత నిమజ్జనం చేసే వారు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షానికి కొన్ని కాలనీల్లో కొంత సేపు మోకాలి లోతు నీరు రోడ్లపై ప్రవహించింది.



కాళోజీ కళాక్షేత్రం వద్ద రోడ్డుపై నిలిచిన వరద నీరు

# ఉత్సాహంగా దసరా

## ఘనంగా దశకంఠుడి దహనం



పర్వతగిరి : దసరా వేడుకల్లో పాల్గొన్న దయాకర్‌రావు



రంగలీలా మైదానంలో దహనమవుతున్న దశకంఠుడు

నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 13: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉమ్మడి జిల్లా ప్రజలు ఉత్సాహంగా దసరా పండుగను జరుపుకున్నారు. పాలపిట్టను దర్శించుకొని జమ్మి చెట్టు వద్ద పూజలు చేసి జమ్మి ఆకును కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులకు ఇచ్చి అలయ్ బలయ్ తీసుకున్నారు. ఆయా చోట్ల పేల్చిన బాణసంచాలతో ఆకాశంలో తారాజువ్వలతో హరివిల్లు విరిసింది. రావణాసురుల ప్రతిమలకు నిప్పంటించి దహ నం చేశారు. పర్వతగిరిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బొడ్రాయి వద్ద, జమ్మి పూజలో పాల్గొని జమ్మి పూజలు నిర్వహించారు. జనగామలోని బతుకమ్మకుంట వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. హనుమకొండలోని సిద్ధేశ్వరాలయ ప్రాంగణంలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నగర ప్రజలు రావణవధ తిలకించడానికి వచ్చారు. వరంగల్ ఉర్సు రంగలీలా మైదానంలో ఏర్పాటు చేసిన దసరా వేడుకలు అంబరాన్నంటాయి. మైదానం ప్రజలతో కిక్కిరిసిపోయింది. ఆటా-పాటా, బాణసంచాల మోతతో ఉర్సు గుట్ట దద్దరిల్లింది. గ్రేటర్ వరంగల్ నగరంలోని 20వ డివిజన్ పద్మనగర్ చిన్నవడ్డేపల్లి చెరువు సమీపంలో రావణవధ నిర్వహించగా, ప్రజలతో కిక్కిరిసిపోయింది. ఆయా చోట్ల మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీలు, బస్వరాజు సారయ్య, డాక్టర్ బండా ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, సీపీ అంబర్ కిశోర్ ఝా, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు.

### కాలేజీలు బంద్ చేస్తే కఠిన చర్యలు

- కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 13 : కేయూ పరిధిలోని ప్రైవేట్ కాలేజీలు నిరవధిక బంద్ పాటిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి ఆదివారం హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో కాలేజీలను సెలవుల తర్వాత నిరవధికంగా బంద్ చేస్తామని ప్రైవేట్ కాలేజీల నిర్వాహకులు వినతిపత్రం ఇచ్చిన సందర్భంగా రిజిస్ట్రార్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. కాలేజీల బంద్ ప్రభావం డిగ్రీ, పీజీ పరీక్షలపై ఉంటుందని తెలిపారు. ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు నిరవధిక బంద్‌ను విరమించుకోవాలని ఆయన కోరారు.

# అక్రమార్కులకు వారధి

### స్మగ్లర్లకు రాచమార్గంగా లక్ష్మీ బరాజ్

- కలిసివస్తున్న రెండు రాష్ట్రాలను కలిపే వంతెన
- బరాజ్ మార్గంపై కొరవడిన నిఘా
- గతంలో ఉన్న పోలీస్ క్యాంపు ఎత్తివేత
- ప్రైవేటు సెక్యూరిటీ చేతివాటం?
- రాత్రి వేళల్లో వాహనాలకు అనుమతి
- ఇప్పటికే పలుమార్లు గంజాయి, వన్యప్రాణుల మాంసం పట్టివేత



రెండు రాష్ట్రాల ప్రజలకు వారధిగా ఉన్న లక్ష్మీ బరాజ్



వాహనాలను అనుమతిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : రెండు రాష్ట్రాల ప్రజలకు వారధి అక్రమార్కులకు రాచమార్గంగా మారింది. ఇటు తెలంగాణ.. అటు మహారాష్ట్ర మధ్య నిర్మించిన లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్‌పై ఏర్పాటు చేసిన రహదారి స్మగ్లర్లకు కాసులు కురిపిస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సాగునీటి అవసరాలు తీర్చేందుకు ఈ బరాజ్‌ను నిర్మించగా రెండు రాష్ట్రాల ప్రజలకు దూరాభారాన్ని తగ్గించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బరాజ్ పిల్లర్ కుంగిందని పట్టించుకోకపోవడంతో ఇరిగేషన్ అధికారులు దానిపై నుంచి బైక్‌లు మినహా మిగతా వాహనాల రాకపోకలు నిలిపివేశారు. అక్కడున్న పోలీస్ క్యాంప్‌ను సైతం ఎత్తివేసి ప్రైవేట్ సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. ఇది అక్రమార్కులకు వరంగా మారింది. పైగా బరాజ్ ఏర్పాటు చేసిన అంబట్‌పల్లి గ్రామం మహదేవపూర్ మండలంలోని మారుమూల ప్రాంతం కావడంతో అక్కడ పోలీసు ఫోకస్ అంతగా ఉండదు. దీనిని ఆసరాగా చేసుకున్న స్మగ్లర్లు తమ కార్యకలాపాలకు ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తున్నది. అయితే రాత్రివేళ రూ. 500 తీసుకుంటూ ఇతర వాహనాలను ప్రైవేట్ సెక్యూరిటీ అనుమతిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. దీంతో ఇటు నుంచి అటు.. అటు నుంచి ఇటు మద్యంతో పాటు గంజాయి, వన్యప్రాణుల రవాణా యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలిసింది. కాళేశ్వరం వద్ద గోదావరి నదిపై ఏర్పాటు చేసిన బ్రిడ్జి మహారాష్ట్రకు దగ్గరి దారైనప్పటికీ ఇక్కడ పోలీస్ నిఘా నిరంతరం కొనసాగుతుంది. దీంతో స్మగ్లర్లు కొంచెం దూరమైనా లక్ష్మీ బరాజ్‌ను సేఫ్‌గా భావిస్తున్నట్లు తెలుస్తున్నది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి ఎక్కువగా వన్యప్రాణుల మాంసం భూపాలపల్లి జిల్లాకు తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం. భూపాలపల్లికి చెందిన కొందరు వ్యక్తులు సిరొంచ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన స్మగ్లర్లతో సంబంధాలు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఇటీవల అంబట్‌పల్లి సమీపంలో పోలీసులు గంజాయి రవాణా చేస్తున్న వారిని, సూరారం వద్ద వన్యప్రాణుల మాంసం విక్రయిస్తున్న వారిని పట్టుకుని అటవీశాఖకు అప్పగించిన సందర్భాలున్నాయి.

**గోదావరి దాటుతున్న కలప**

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి స్మగ్లర్లు టేకు కలపను గోదావరి నది దాటిస్తున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కలప తరలింపు సాధ్యమయ్యే పని కాదని గుర్తించిన స్మగ్లర్లు పలిమెల సమీపంలోని గోదావరి పైనుంచి తరలిస్తూ జిల్లాలోని సరిహద్దు గ్రామాల్లో నిల్వ చేస్తున్నారు. ఇటీవల అటవీశాఖ అధికారులు టేకు దుంగలను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

**తనిఖీలు పెంచుతున్నాం : రామ్మోహన్ రెడ్డి, డీఎస్పీ, కాటారం**

సరిహద్దు గ్రామాల్లో తనిఖీలను పెంచుతున్నాం. గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నాం. స్మగ్లింగ్, అసాంఘిక కార్యకలాపాలపై స్పెషల్ ఫోకస్ పెడుతున్నాం. లక్ష్మీ బరాజ్ పైనుంచి ఉన్న దారిలో స్మగ్లింగ్, ఇతర కార్యకలాపాలు సాగుతున్నట్లు సమాచారం ఉంది. అక్కడ పోలీసు చెక్‌పోస్టు లేదు. ఇరిగేషన్ అధికారులు ప్రత్యేకంగా ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను నియమించుకున్నారు. వాళ్లు ఇతర వాహనాలను సైతం రహస్యంగా అనుమతిస్తున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా ఈ మార్గంపై ఇక నుంచి ప్రత్యేక దృష్టి సారిస్తాం.